

# ఎవరి పాపం వారిదే!

గంటి రమాదేవి

ఆఫీసులో ఎవ ర్తే తప్పు చేసినా తనను దోషిని చేసి మెమో లిస్తే 'పోనీలే వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు' అనుకునేవాడు. అల్లుడు కూతుర్ని చంపి ఉంటాడని భార్య పోలీసు కంప్లైయింట్ ఇచ్చినప్పుడూ ఆ మాటే అన్నాడు.

అత. నేం పాపం చేశాడని అతను అటువంటి సంభావణ వినగలిగాడు? అది నిజంగా అతని పాపమేనా?

గుండె దడదడలాడింది శేషాచలానికి, "మీకు టెలిఫోను సార్" అనగానే.

టెలిఫోను భాస్కరరావే చేసుంటాడు. 'మీ అమ్మాయిని ఇక నే నేలుకోను' అన్న అర్థం వచ్చే మాటలు చెబుతాడు. 'కొంచెం ఓపిక పట్టు బాబూ! అన్నీ సర్దుకుంటాయి' అని సర్ది చెబుతాడు తను. సాయంత్రం భార్యతో సహా భాస్కరరావు ఇంటికి వెడతాడు. రోగిష్టిదానిలా నీరసంగా కనిపిస్తుంది అమ్మాయి. పది పదిహేను నిముషాలు ఏవో మాట్లాడి ఇంటికి వస్తారు. పెళ్ళయిన నాలుగు నెలల నుంచి ఇదే జరుగుతోంది.

సీటులో నుంచి లేచి టెలిఫోను దగ్గరకు వెళ్లాడు. టెలిఫోను చెవి దగ్గర పెట్టుకుని "హలో" అన్నాడు.

"భాస్కరరావుని మాట్లాడుతున్నా!"

"ఏం జరిగింది బాబూ?" తడబడుతూ అన్నాడు శేషాచలం.

పిడుగుపాటులా వినబడ్డాయి భాస్కరరావు మాటలు.

"నిజమేనా?" ఆశ్చర్యంతోను, బాధతోను అడిగాడు.

"అక్షరాలా. వచ్చి చూసుకోండి కావాలంటే. వారం రోజుల వరకు నాకూ అనుమానం రాలేదు"

"నీకు ఎప్పుడు తెలిసింది?"

"ఉదయం లేచిన దగ్గర నుంచి కనబడలేదు. ఎక్కడికో వెళ్ళి ఉంటుందనుకున్నా. ఇంకా రాకపో

యేసరికి మీది పక్క వీథే కాబట్టి అక్కడికి వచ్చిందనుకున్నా. పది గంటల వరకు రాకపోయే సరికి మీ ఇంటికి వెళ్ళా. అక్కడ అత్తగారు ఒక్కరే ఉన్నారు. అది లేదు."

"నేనిప్పుడే వస్తున్నా బాబూ! ఇప్పుడు నువ్వెక్కడున్నావ్?"

"పోస్టాఫీసులో!"

"సరే! ఇంటి కెళ్ళు. పర్మిషన్ తీసుకు వస్తున్నా."

× × ×

శేషాచలం ఇంటికి వచ్చేసరికి బయట నిలబడి ఉన్నాడు భాస్కరరావు.

"అసలేం జరిగిందో చెప్పు బాబూ!" అన్నాడు భాస్కరరావు నుద్దేశించి శేషాచలం.

"మా ఇంటి ముందు కాలేజీ కుర్రాళ్ళు అద్దెకుంటున్నారు. గుమ్మంలో నిలబడి వాళ్ళనే చూస్తుంటే, మొదట్లో నే ననుమానించలేదు. వారం రోజుల క్రితం, 'అది' రోడ్డు దాటుతూ కని పించింది. మీ ఇంటికైతే రోడ్డు దాటక్కర్లేదు. నిఘా వేశాను. నే ననుకున్నట్టే అయింది. వాడే దీని వలలో పడ్డాడో!"

"నువ్వు చెబుతున్నది నిజమని ఏమిటి? మా అమ్మాయి అలాటిది కాదు!" కోపంగా అంది శేషాచలం భార్య.

"సరోజా! నువ్వూరుకో!" భార్యను మందలించాడు శేషాచలం.

"నన్నేం చేయమంటావ్?" శేషాచలం అడిగాడు.

"మీ ఇష్టం." భాస్కరరావు వెళ్ళిపోయాడు.

× × ×

"మీరెప్పుడూ ఇంతే! మెతక! ఆ గుమాస్తా ఉద్యోగం చేసి చేసి అలవాటైపోయి... మన అమ్మాయి ఇలాంటి పని చేస్తుందని నే ననుకోవడంలేదు. ఇది ఆ భ్రష్టుడు పన్నిన కుట్ర! దాన్ని చంపి ఎక్కడో పడేసి..." కోపంగా అరుస్తోంది సరోజ.

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"ప్రతీ దానికీ ఇదోటి. ఏం చెయ్యమంటావ్? ఏం చెయ్యమంటావ్?"

శేషాచలం మౌనంగా ఊరుకున్నాడు.

మళ్ళీ అంది సరోజ. "నాకేదో అనుమానంగా ఉంది. పోలీసు రిపోర్టు ఇవ్వండి. నాలుగు పడేసరికి నిజం కక్కుతాడు వెధవ!"

శేషాచలం మెల్లగా అన్నాడు- "ఏమని రిపోర్టు ఇవ్వమంటావ్? అమ్మాయి లేచిపోయిందనా? పరువు మంటకలిసిపోదూ? పరువు కాపాడుకోటం కోసం మా వంశీకులు ఎంత త్యాగానికయినా పూనుకున్నారు. ఈ రోజు ఈ ఇల్లు, పదెకరాల కొబ్బరితోట బదులు వంద ఎకరాల మాగాణీ, ఏభై ఎకరాల తోట, ఇంకా ఇళ్ళు ఉండుండేవి."

"అలా అని అమ్మాయిని చంపిన వాణ్ణి వదిలేస్తారా? పోలీసు రిపోర్టు మీ రివ్వకపోతే, నే నిస్తాను."

శేషాచలం రిపోర్టు ఇవ్వలేదు.

× × ×

- "మీ అమ్మాయి తప్పిపోయిం దంటున్నారు?

## సూపర్ డాడీ

ఆఫ్రికా ఖండానికి చెందినే 'జింబాబ్వే' దేశ పౌరుడు శ్రీ తుమా జమాస్కాసెను ఆ దేశ ప్రజలు, జర్నలిస్టులూ అందరూ 'సూపర్ డాడీ' అని పిలుస్తారు. శ్రీ జుమాస్కాసె 24 మంది భార్యలతో 139మంది పిల్లలతో సంసార సాగరాన్ని మథిస్తున్నాడు. అతని భార్యలలో ముగ్గురు గత మే నెలలో ముగ్గురు శిశువులను కన్నారు. ఇంకో ముగ్గురు నేడో, రేపో కనబోతున్నారు. శ్రీ జుమాస్కాసె ఈ మధ్యనే పెళ్ళి చేసుకున్న 24వ భార్య వయసు కేవలం 12 సంవత్సరాలు.

వల్లాల సుషమ [బలపాల]

ఎప్పుడు?" పోలీసు ఇన్స్పెక్టర్ అడిగాడు.

సరోజ విచారంగా అంది. "ఈ ఉదయం నుంచి?"

"రాత్రి అఖరిసారి ఎప్పుడు చూశారు?"

"పక్క పేటలో భాస్కరరావని మా అల్లుడు ఉన్నాడు. అక్క డుంటోంది. రాత్రి ఉంది. తెల్లారి లేచేసరికి లేదు."

"ఆయన రిపోర్టు ఇవ్వకుండా, మీ రిస్తున్నారేం?"

సరోజ కొన్ని క్షణాలు తటపటాయించింది. "మాది పరువు గల కుటుంబం. ఎదురింట్లో ఉండే కాలేజీ అబ్బాయితో లేచిపోయుంటుందని అల్లు డంటున్నాడు."

"అంటే!.. మీ రనుకోవడం లేదా?..."

"లేదు. మా అమ్మాయి నిప్పులాటిది."

"మీకెవరి మీదైనా అనుమానం ఉందా?"

మౌనంగా పక్కసీట్లో కూర్చున్న భర్త వైపు చూసింది సరోజ. గట్టిగా ఊపిరి పీల్చి అంది.

"మా అల్లుడే చంపేసి..."

"వాట్?"

"నా అనుమానం అదే!"

శేషాచలం మండిపడుతూ చూశాడు సరోజను.

ఇన్స్పెక్టరులో ఇదివరకటి నిర్లిప్తత పోయింది. కుతూహలంగా ముందుకు వంగాడు. "భార్యాభర్తలకు పొత్తు లేదా?"

"లేదు..."

× × ×

ఇన్స్పెక్టరు పరిశోధన ప్రారంభించాడు. భాస్కరరావును ప్రశ్నించినా ఫలితం దక్కలేదు. భాస్కరరావు నేరం చేసినట్టు ఇన్స్పెక్టరుకు అనిపిస్తోంది. చాలా ధైర్యంగా ఉన్నాడు నేరస్తుడు. భాస్కరరావు భార్యను మాయం చేశాడు. ఏం చేశాడు? బంధించాడా? చంపేశాడా?

భాస్కరరావు ఇల్లంతా శోధించాడు ఇన్స్పెక్టరు. ఆధారాలు దొరకలేదు. ఇంటి వెనుక పెరడు: నుయ్యి. ప్రహరీగోడ, క్షుణ్ణంగా చూశాడు. ఒకచోట పచ్చగడ్డి ఎండిపోయి ఉంది. తవ్వినట్టుగా ఉంది.

"ఇక్కడ తవ్వారా?" ఆ చోటు చూపిస్తూ భాస్కరరావు నడిగాడు.

"అవును!"

"ఎందుకు?"

"రాణిని పాతిపెట్టడానికి..."

"రాణీ?"

"మా పెంపుడు కుక్క."

పెరడంతా తవ్వించాడు. కుక్క అస్థిపంజరం కనుపించింది.

కేసు ముందుకు కదలలేదు. ఆగిపోయింది.

ఆకుపచ్చ గళ్ళ చొక్కా వేసుకున్నాడు శేషాచలం. కూతురు తప్పిపోయి పది రోజులైంది. దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఈ పది రోజులూ గడిపాడు. అప్రయత్నంగా జేబులో చెయ్యి పెట్టాడు. కాగితం తగిలింది. పదిహేను రోజుల క్రితం రాసిన ఉత్తరం. మనస్సు వెనక్కు పరుగెత్తింది.

"నాన్నా! ఈయన నన్ను బతకనివ్వడు. చంపేస్తాడు. అలా జరిగితే విడిచిపెట్టకు!"


"అలాగే అమ్మా... మళ్ళీ మరిచిపోతానేమో! కాగితం కలం తీసుకురా."

కాగితం కలం తీసుకుని ఇలా రాశాడు,

"నే నెట్టి పరిస్థితులలోనైనా మరణిస్తే అది సహజ మరణంగా భావించరాదు. దానికి కారకులు నా..."

ఉత్తరం పూర్తి చేయకుండా జేబులో పెట్టుకున్నాడు. అమ్మాయి ఊహించినదే జరిగింది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

అమ్మాయి కూడా తనలాగే మెతక. కొంచెం



కరుకు అయితే భాస్కరరావును దారిలో పెట్టేదే? దేము డలా పుట్టించాడు. ఇప్పుడు మారమంటే వీలవదు.

ఇంటికెళ్ళి సరోజకు ఈ ఉత్తరం చూపిస్తే! భాస్కరరావును అరెస్టు చేసే వీలవుతుందేమో? వెనక్కు తిరిగి ఇంటికి వెళ్ళాడు.

సరోజ ఇంటి పని ముగించుకుని నూతి దగ్గర ఉంటుంది. వీధి తలుపు కొట్టినా వినపడదు.

పెరటి వైపు నడిచాడు. నూతికి వంద గజాల దూరంలో మడిలా తవ్వి ఉంది. ఆరడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు. గడ్డి మొక్కలు పెరుగుతున్నాయి. నీరు పోస్తున్నారు ఆ ప్రదేశంలో.

తలుపు తెరిచి ఉంది. అక్కడెందుకు తవ్వారు? అక్కడే నీళ్ళు పోస్తున్నారెందుకు? ఆలోచిస్తూ లోపలకు వెళ్ళాడు. లోపల గుసగుసలు.

"సరోజా!"

"ఊఁ..."

"భలే నాటకం ఆడావు. ఒక దెబ్బకు రెండు పిట్టలు!"

"ఉష్!"

"నీ తెలివి అమోఘం. ఆ ఏడుపుగొట్టును ముందు ఇంటికి రానిచ్చావ్? అది చచ్చిన తర్వాత గొయ్యి తవ్వి పాతేశావ్! నా మీద అనుమానం బలపడాలని రిపోర్టు ఇచ్చావ్? తెలివిగా బోల్తా కొట్టించావ్ అందర్నీ."

నిలువు గుడ్లతో అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు. ఒక్కో మాటా సమ్మెటపోటులా వినిపిస్తోంది, శేషాచలానికి.

సరోజ శేషాచలం రెండో భార్య.

× × ×

పిచ్చిగా రోడ్డు మీద నడుస్తున్నాడు శేషాచలం. పెద్ద వయసులో రెండో పెళ్లి చేసుకోవడం తప్పేం కాదనీ, చాలామంది రెండో పెళ్ళి వాళ్ళు సుఖంగా ఉన్నారనీ శ్రేయోభిలాషులు బలవంతం చేస్తే చేసుకున్నాడు. అది సరియైన అభిప్రాయం కాదని తెలిసింది. ఇంత దారుణమా? భాస్కరరావు, సరోజ కలిసి తన బిడ్డను...

పోలీసు రిపోర్టు ఇవ్వాలా? వద్దా? ఛ... పోనీ... వాళ్ళ పాపాన వాళ్ళే పోతరు? వాళ్ళ నెందుకు

## భూగర్భ తపాలా రవాణా

జర్మనీలోని అతి పెద్ద రేవు పట్టణమైన హాంబర్గ్ నగరంలో తపాలా సంచులు భూమిలోపల గల ప్రత్యేక తపాలా రోడ్ల ద్వారా "ఒత్తిడి ప్రక్రియ"లో గంటకు 45 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక్కొక్క సంచీలో సుమారు 2000 ఉత్తరాలు, నిర్ణీత పరిమాణంలో పార్సిల్సు పంపుతారు. ఇది హాంబర్గ్ నగర పోస్టల్ విధాన ప్రత్యేకత.

వల్లాల సుషమ [బలపాల]

బాధించడం? కన్న కూతురు ఎలాగూ పోయింది. ఇక సరోజను ఎలాగూ చూడలేడు. తన కొకటే మార్గం. కూతుర్ని వెతుక్కుంటూ పోవడం? అమాయకులకు ఇక్కడ చోటు లేదు.

ఆఫీసుకు వెళ్ళి రాజీనామా కాగితం టేబులు మీద ఉంచి బయటకు వచ్చాడు.

తాగిన దానిలా వస్తోంది లారీ. లారీ తాగలేదు. లారీ డ్రైవరు తాగాడు.

శేషాచలం లారీకి తగిలాడు. కొండకు పువ్వులా నలిగిపోయింది పువ్వు.

× × ×

రక్తపు మడుగులో ఆకుపచ్చ గళ్ళ చొక్కా రంగు మారింది. జేబులో ఉత్తరం చూశాడు ఇన్‌స్పెక్టర్. శేషాచలాన్ని గుర్తుపట్టాడు.

ఇన్‌స్పెక్టరు తలుపు బాదుతూ ఉంటే సరోజ తలుపు తీసింది. లోపల అలికిడి అయి తొంగి చూశాడు ఇన్‌స్పెక్టరు. భాస్కరరావు పెరట్లోకి వెళ్ళడం చూచాయగా తెలిసింది.

నూతి దగ్గరకు వెళ్ళాడు ఇన్‌స్పెక్టరు. ఎడారిలా ఉన్న పెరట్లో కొంత మేర పచ్చగా ఉంది. ఆకుపచ్చగా ఉంది. ఆకుపచ్చ గళ్ళ షర్టులో ఉన్న విషయం...!

ఇన్‌స్పెక్టరు బూటుకాలు పచ్చగా మొక్కల్ని నలిపేసింది.

గునపంతో మట్టి పెల్లగిస్తున్నారు పోలీసులు.

శేషాచలం ఆసుపత్రిలో ఆఖరి శ్వాసతో మృత్యువుతో పోరాడుతున్నాడు.

× × ×

శేషాచలానికి తెలియదు. తెలుసుంటే ఏమనుకునేవాడో.

"నాన్నా! ఈయన నన్ను బ్రతకనివ్వడు. చంపేస్తాడు. అలా అయితే విడిచి పెట్టకు." అన్న కూతురి మాటలు చివరి వరకు శేషాచలం మనసులో తిరుగుతూనే ఉన్నాయి.

మగతలో తెలివి-తెలివిలో మగత. జీవితపు ఆఖరి ద్వారం దగ్గర నిలబడి వెనక్కు చూస్తున్న అనుభూతి.

తాను దాటి వచ్చిన దారి అగాధం మారింది. తిరిగి వెళ్ళలేదు. అమ్మాయి ఆఖరి కోరిక తన వల్ల తీరకుండా పోయిందా? ఆమె ఉత్తరం పోలీసులకు ఇచ్చి ఉండాల్సింది? పోనీలే, తన కెందుకు? ఎవరి పాపాన వారే పోతరు.

అయినా శేషాచలానికి ఆ మాట మీద నమ్మకం లేదు. జీవితంలో ఎన్నోసార్లు కరక్కాయలాటి చేదు అనుభవాల్ని రుచి చూశాడు.

ఆఫీసులో జరిగే తప్పులకు తననే బాధ్యుడిని చేసి మెమోలు ఇప్పించిన కొలీగ్స్ మీద గాని, అమాయకుడని అప్పు తీసుకుని ఎగవేసిన దొంగ స్నేహితుల మీద గాని, ఎన్నో దుఃఖాలకు, వేదనకు గురి చేసిన బంధువుల మీద గాని తన "పోనీలే" అన్న మాట పని చేయలేదు.

అందరూ సుఖంగా ఉన్నారు! ఇబ్బడిగా ఐశ్వర్యాలు పొందారు! సంతోషంగా ఉన్నారు.

శేషాచలానికి వెనుక నున్న అగాధం మరీ దగ్గరవుతున్నట్టు అనిపించింది.

ఆ ఆఖరి క్షణాల్లో ఆ అర్భక జీవికి ఒక అనుమానం వచ్చింది.

అసలు దేముడున్నాడా? ఉంటే అన్యాయాన్ని చూస్తూ ఊరుకుంటాడా?

తన కన్న కూతుర్ని ఘోరంగా చంపి ఆ భౌతికావశేషాలన్నీ తనింట్లోనే పాత-

తర్వాత తెరలు తెరలుగా జ్ఞాపకాల మరుగుల మధ్య, గాఢాంధకార సముద్రంలో మునుగుతున్నట్టు భావన. అంతలో చిన్న వెలుతురు!

పోలీసులకు అనుమానం రాకుండా, సరోజే రిపోర్టు ఇచ్చి-

చిక్కటి కాటుకలాటి శూన్య కుహరాల్లోకి జారిపోతున్న శేషాచలం మనసు ఒక క్షణం వెలుగు చూసింది.

సరోజకూ, భాస్కరానికీ ఎలా కుదిరింది? తనకూ, అమ్మాయికీ ఎందుకు తెలియలేదు? ఇదంతా ఎలా తెలుస్తుంది లోకానికి? వీళ్ళ మోసం అందరికీ తెలియాలి! గట్టిగా అరిచి చెప్పాలి!

"డాక్టర్! డాక్టర్!" గొంతు చించుకు అరిచాడు.

"నేను పోలీసు రిపోర్టు ఇవ్వాలి..." వంగి శేషాచలం ముఖంలో చూస్తున్న డాక్టర్ అన్నాడు.

"ఫేషియల్ నర్వ్ కదిలింది. దట్ మీన్స్..."

హఠాత్తుగా శేషాచలంలో కదలిక ఆగిపోయింది. అతని ఆఖరి కోరిక తీరలేదు.

కాని జీవితాంతం పట్టుకుని వేలాడిన పనికి రాని మాట- తాత్కాలికంగా అతనికి ఆత్మ తృప్తినిచ్చిన మాట నిజమైంది.

"ఎవరి పాపాన వారే పోతరు" అన్న మాట అతన్ని జీవితాంతం వెన్నాడిన ఆ మాట, పోయిన తర్వాత కాని నిజం కాలేదు. ★

